సాక్షి
నిజామాబాద్
బుధవారం, 27, నవంబర్, 2024



రాష్ట్ర సాధనే లక్ష్యంగా..

రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు

గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజిరెడ్డి తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /10.9

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



నిజామాబాద్ అర్బన్ : రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..



ఖలీల్‌వాడి: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం డీసీపీలు కోటేశ్వర రావు, బస్వారెడ్డి, శంకర్ నాయక్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఆర్. ఏసీపీ నాగయ్య, సూపరింటెండెంట్లు శంకర్, బషీర్, వనజరాణి, రిజర్వు సీఐ సతీష్ కుమార్, తిరుపతి, శ్రీనివాస్, శ్రీపాల్, శేఖ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు



ఖలీల్‌వాడి : రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లకు ఆర్‌ఎం జానీరెడ్డి మంగళవారం నగరంలోని డిపో–1లో ప్రగతి చక్రం పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ వి శంకర్, అకౌంట్స్ ఆఫీసర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ విధానం పెట్టాలని దాఖలైన వ్యాజ్యం కొట్టివేత

నిజామాబాద్‌అర్బన్ : భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని పున: ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ డాక్టర్ కౌల్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని పేర్కొన్నారు. పిటిషన్‌ను తిరస్కరించిన సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసిందని, ఎన్నికలలో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తిచూపిందన్నారు. ఈవీఎంల వ్యవస్థతో రాజకీయ పార్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీబీ వరాలేలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టర్ తెలిపారు.

ఇద్దరు డీసీపీల బదిలీ



బస్వారెడ్డి



కోటేశ్వర్‌రావు

ఖలీల్‌వాడి : జిల్లాలోని ఇద్దరు డీసీపీలను బదిలీ చేస్తూ మంగళవారం సాయంత్రం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) కోటేశ్వర్ రావును ఎల్‌బీనగర్‌కు బదిలీ చేయగా, అదనపు పోలీస్ కమిషనర్(లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డిని నిజామాబాద్ అడ్మిన్‌గా నియమించారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లలో తనిఖీలు



నిజామాబాద్ నాగారం : నగరంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లలో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. వైద్య మండలి వైస్ చైర్మన్ శ్రీనివాస్, సభ్యులు బండారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని 15 క్లినిక్‌లను పరిశీలించారు. సమీర్ రాయ్ ప్రియాంక క్లినిక్, జుగల్రాయ్ దేవిక రాయ్ భారతి క్లినిక్ పేర్లతో కనీస విద్య అర్హత లేకుండా ఆధునిక వైద్యం చేస్తూ విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్ ఇస్తున్నట్లు గుర్తించారు. అలాగే పైల్స్‌కు ట్రీట్మెంట్ చేస్తున్నట్లు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. నకిలీ వైద్యుల క్లినిక్‌లకు అనుబంధంగా మూడు మెడికల్ దుకాణాల్లో సైతం క్వాలిఫైడ్ డాక్టరు ప్రిస్కిప్షన్ లేకుండా యాంటీ బయాటిక్ ఇంజెక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. వీరిపై డ్రగ్ కంట్రోల్ అథారిటీతో పాటు ఫార్మసీ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేయనున్నట్లు సభ్యులు తెలిపారు. మెడికల్ కౌన్సిల్ సభ్యులు రాజకుమార్, విష్ణు, విజయ్ కుమార్ తనిఖీలలో పాల్గొన్నారు.

52 ఏళ్లుగా అన్నం బంద్!

- పాలు, పండ్లు ఆయన ఆహారం
- 76 ఏళ్ల వయస్సులో సంపూర్ణ ఆరోగ్యంతో లొక్కిడి గంగారాం
- ఆధ్యాత్మిక సేవలో తరిస్తున్న రిటైర్డు ఉపాధ్యాయుడు



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు లొక్కిడి గంగారాం యాభై రెండేళ్లుగా అన్నం తినడం బంద్ చేశారు. వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో 1948లో గంగారాం జన్మించారు. యాభై ఏళ్ల క్రితం ఆయన కొలిప్యాక్ గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. దైవ చింతన ఎక్కువగా ఉండడంతో అప్పటి నుంచి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద ఓ రెండు గదులలో నివాసం ఉంటున్నారు. గంగారాంకు భార్య సత్యగంగు ఉన్నారు. కుమారుడు గతంలోనే వాగులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. ప్రస్తుతం గంగారాం వయస్సు 76 ఏళ్లు. గంగారాంకు 1971లో టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. మొదటి పోస్టింగ్ కలిగోట్ యూపీఎస్ పాఠశాలలో రాగా, అక్కడే 18 ఏళ్లు పని చేశారు. అప్పుడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 1972 సంవత్సరం నుంచి గంగారాం అజీర్తి సమస్యతో అన్నం తినడం బంద్ చేశారు. దీంతో ఆహారంగా పల్లి పలుకులు, నీరు తీసుకోవడం ప్రారంభించారు. ఉపాధ్యాయుడిగా కలిగోట్, కొలిప్యాక్, మనోహరాబాద్, కొండాపూర్, మచ్చర్ల, సుర్బిర్యాల్, ఖుదావంద్‌పూర్, చేంగల్, వాడి, లింగాపూర్ గ్రామాల్లో పని చేశారు. 2004లో ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి పండ్లు జ్యూస్, అరటి, ఆపిల్, సీజనల్ పండ్లు తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. యాభై రెండు ఏళ్లుగా ఎలాంటి అనారోగ్యం రాలేదని గంగారాం తెలిపారు. ఒక్క మందు గోలి, ఇంజెక్షన్ తీసుకోలేదన్నారు. స్వచ్ఛమైన గాలి, సాత్విక ఆహారం తీసుకుంటే అనారోగ్యం దరి చేరదన్నారు. ప్రస్తుతం గంగారాం ఆధ్యాత్మిక సేవలో నిమగ్నమయ్యారు. గత యాభై ఏళ్ల గా ఊరూరా తిరుగుతూ 'శ్రీరామ కోటి 'రాయిస్తున్నారు. వెయ్యి కోట్ల రామనామం రాయించాలని సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం మనోహరాబాద్ గ్రామ రెవిన్యూ శివారులో పాండురంగ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతి రోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. లోక కల్యాణం, భక్తిభావం, మానవతా దృక్పథంతో భగవంతుని సన్నిధికి చేరుకోవాలని తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. 84 లక్షల జీవరాశులలో మానవ జన్మ అత్యంత శ్రేష్ఠమైనదని, ఈ జీవితం భగవంతునికి అంకితమని చెబుతున్నారు. ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం 76 ఏళ్ల వయసులో బైక్‌పై తిరుగుతూ రామకోటి రాయిస్తున్నారు. ఆశ్రమానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నారు. పాండురంగ ఆశ్రమం వద్ద అన్ని రకాల దేవత విగ్రహాలను, స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. పచ్చని చెట్లు, ఆహ్లాదాన్ని పంచే వాతావరణంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆశ్రమానికి వచ్చే వారికి దైవత్వాన్ని బోధిస్తున్నారు.

తెయూలో మరో గర్ల్స్ హాస్టల్



తెయూ క్యాంపస్‌లో ప్రస్తుతం ఉన్న బాలికల హాస్టల్

- రూసా నిధులు రూ.7 కోట్లతో నిర్మాణం
- వారం రోజుల్లో పనులు ప్రారంభం..
- ప్రస్తుతం ఒకే హాస్టల్.. ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్న బాలికలు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రెండవ బాలికల (గర్ల్స్) హాస్టల్ నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇటీవలే టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో టెండర్ ఖరారుకాగా, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్నారు.

తెయూ మెయిన్ క్యాంపస్ లో 2008–09 లో గర్ల్స్ హాస్టల్ ప్రారంభించారు. ప్రతి యేటా పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, ఎల్‌ఎల్‌బీ కోర్సులలో బాలుర కంటే బాలికల ప్రవేశాలు ఎక్కువగా ఉంటున్నాయి. బాలురకు రెండు హాస్టల్స్ ఉండగా బాలికలకు మాత్రం ఒకటే హాస్టల్ ఉంది. దీంతో ఉన్న ఒక్క హాస్టల్‌లో బాలికలు కిక్కిరిసి తలదాచుకోవాల్సి వస్తోంది. ఒక్కో గదిలో ఇద్దరు, ముగ్గురు ఉండాల్సి ఉండగా గదులు సరిపోక ఆరుగురి నుంచి ఎనిమిది మంది ఉంటున్నారు. దీంతో బాలికలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతనంగా రెండవ గర్ల్స్ హాస్టల్ నిర్మించాలని ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఎట్టకేలకు హాస్టల్ నిర్మాణానికి టెండర్ ఖరారు కావడంతో యూనివర్సిటీలోని బాలికలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యూజీసీ ఆదేశాల మేరకు..

యూనివర్సిటీలు, ఉన్నత విద్యా కళాశాలల్లో అమ్మాయిల భద్రతపై నియమించిన యూజీసీ కమిటీ ఆయా విద్యా సంస్థలు తీసుకోవాల్సిన చర్యలపై 2002 నవంబర్‌లో మార్గదర్శకాలు జారీ చేసింది. ముఖ్యంగా గర్ల్స్ హాస్టళ్లను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిర్మించాలని, క్యాంటీన్, మెస్ హాల్, పరిశుభ్రమైన టాయిలెట్లు, వాషింగ్ మెషిన్లు, వై–ఫై సౌకర్యం, ఇండోర్ గేమ్స్, రీడింగ్ గదులు వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. విద్యార్థినులు ప్రవేశం పొందే సమయంలోనే హెల్ప్‌లైన్ నంబర్లు, స్టూడెంట్ కౌన్సిలర్లు, యాంటీ ర్యాగింగ్ సెల్, అత్యవసర వైద్యం, ఆరోగ్య కేంద్రం, క్యాంటీన్ తదితర పూర్తి వివరాలతో హ్యాండ్ బుక్ ముద్రించి అందించాలని సూచించింది. బాలికల రక్షణకు అనుకూలమైన, సురక్షితమైన ప్రాంగణాలు తీర్చిదిద్దాలని కోరింది. విశ్వసనీయత ఉన్న సెక్యూరిటీ సంస్థల నుంచి తగినంత మహిళా భద్రతా సిబ్బందిని నియమించాలని పేర్కొంది. ఇలా మొత్తం 28 రకాల చర్యలు చేపట్టాలని యూజీసీ సూచించింది. యూజీసీ ఆదేశాల మేరకు ప్రస్తుతం వర్సిటీలో రెండవ గర్ల్స్ హాస్టల్ నిర్మాణానికి మోక్షం లభిస్తోంది.

■ యూనివర్సిటీలో నూతన గర్ల్స్ హాస్టల్ నిర్మాణానికి రూసా రూ.7 కోట్లు నిధులు మంజూరు చేసింది. నిధులు మే నెలలో మంజూరయ్యాయి. అయితే అప్పట్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో టెండర్ పిలువలేక పోయారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడం, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకోవడంతో త్వరలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇటీవలే తెలంగాణ యూనివర్సిటీకి నూతన వైస్‌చాన్స్‌లర్‌గా యాదగిరి రావు నియామకమయ్యారు. టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో వారం రోజుల్లో గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హాస్టల్ పూర్తయితే విద్యార్థులకు ఇబ్బందులు తీరుతాయి.

బోనస్‌తో రైతుల్లో సంతోషం



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అధికారులు

- 30న అట్టహాసంగా రైతు పండుగ
- డిఫాల్ట్ మిల్లర్లపై చర్యలు చేపట్టాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్ : మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వడంపై రైతులు సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 30 న మహబూబ్ నగర్ జిల్లాలో 'రైతు పండుగ'ను అట్టహాసంగా నిర్వహించనున్నామని వెల్లడించారు. మంగళవారం సాయంత్రం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్‌లతో ధాన్యం సేకరణ, రైతులకు బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఆయా జిల్లాల వారీగా సేకరించిన ధాన్యం, రైతులకు జరిపిన చెల్లింపుల గురించి ప్రస్తావిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో పకడ్బందీ పర్యవేక్షణ కోసం ప్రతి కేంద్రానికి ఒకరు చొప్పున అధికారులను ప్రత్యేకంగా నియమించాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డిఫాల్ట్ మిల్లర్లపై చట్టప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, పాఠశాలలతో పాటు రేషన్ కార్డు కలిగి ఉన్న వారికి కూడా వచ్చే జనవరి నుండి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందుకోసం సన్న ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

మహబూబ్ నగర్ లో నిర్వహించనున్న 'రైతు పండుగ' గురించి అన్ని జిల్లాలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు వేదికలలో రైతు పండుగ కార్యక్రమం ప్రసారం ఉంటుందన్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ధాన్యం కొనుగోళ్ల ప్రగతిని నివేదించగా, వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం రాజేశ్వర్, డీసీవో శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగూబాయి, మెప్మా పీడీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఊర కుక్కల వీరంగం

నగరంలో స్కూలు విద్యార్థులు, ఎడపల్లి మండలంలో గ్రామస్తులపై దాడి






కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారులు

నిజామాబాద్ సిటీ/ఎడపల్లి (బోధన్) : నిజామాబాద్ నగరం, ఎడపల్లి మండలంలో మంగళవారం వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. నగరంలోని పాతబస్తీలోని అహ్మద్‌పుర కాలనీ, మాలపల్లి మధ్యలో నాలుగు కుక్కలు పిచ్చిపట్టినట్లుగా స్కూలు పిల్లలపై ఒక్కసారిగా దాడి చేశాయి. అడ్డు వెళ్లిన స్థానికులు ఇద్దరిని కుక్కలు గాయపర్చాయి. స్కూలు విద్యార్థులు ఎండీ తఖీఫ్, సోఫియా ఖాన్, అబ్దుల్ ఫసీ, ఉజ్మా, ఖాజా, షహీద్, అల్మాస్ కుక్కల దాడిలో తీవ్ర గాయాల పాలయ్యారు. కాళ్లు, చేతులు, తొడలు, కంటి భాగంపైన విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయపడ్డ పిల్లలను తల్లిదండ్రులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బల్దియా అధికారులు వీధి కుక్కలను నివారించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడపల్లి మండలంలోని దుబ్బ తండా గ్రామంలో ముగ్గురు, ఏఆర్పీ క్యాంపు గ్రామంలో ఇద్దరు వీధి కుక్కలు దాడిలో గాయపడ్డారు. ఏఆర్‌పీ క్యాంపు గ్రామంలో బాలిక తీవ్రంగా గాయపడింది.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



ధర్పల్లి ప్రభుత్వ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ధర్పల్లి : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని, నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. మంగళవారం ధర్పల్లిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం, అల్పాహారం కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వండడానికి ముందే ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు వంతుల వారీగా ఆహార పదార్థాలు నాణ్యతను తప్పనిసరి పరిశీలించాలన్నారు. సరుకుల్లో నాణ్యత లోపిస్తే వెంటనే తహసీల్దారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

99 శాతం సర్వే పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే జిల్లాలో 99 శాతం పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వేగవంతంగా నమోదు చేస్తున్నామన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈనెల 30లోపు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ధర్పల్లి మండలం రామడుగులో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటికే విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు, బోనస్ డబ్బులు జమ చేస్తున్నామన్నారు. ధాన్యం సేకరణ పూర్తయిన వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలన్నారు. ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి పాల్గొన్నారు.

మొండి బకాయిలపై కొరడా!

- రూ.50 కోట్లకు పైగా..
- డిమాండ్ నోటీసులు సిద్ధం చేసిన కార్పొరేషన్ అధికారులు

నిజామాబాద్ సిటీ : మొండి బకాయిలపై నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కొరడా ఝులిపించనున్నారు. ఆస్తి పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. బకాయిలు పేరుకుపోయిన వారికి డిమాండ్ నోటీసులు ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో పన్నులు చెల్లించని వారు దాదాపు 26 వేల మంది వరకు ఉన్నారని రెవెన్యూ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మొత్తంగా రూ.50 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు పన్ను చెల్లించని వారి జాబితా సిద్ధం చేశారు. చెల్లించాల్సిన పన్ను, ఫైన్ వివరాలతో డిమాండ్ నోటీసులు రెడీ చేశారు.

బిల్ కలెక్టర్ల ద్వారా నోటీసులు

కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన మొండి బకాయిదారుల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. డివిజన్ల వారీగా ఆయా రెవెన్యూ పరిధిలో బిల్లు కలెక్టర్లకు జాబితాను ఇచ్చారు. డిమాండ్ నోటీసులను బిల్ కలెక్టర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన మొదటి అర్ధ సంవత్సరం పన్నును జూన్ 30లోపు చెల్లించాలి. రెండో అర్ధ సంవత్సరం పన్నులు డిసెంబర్ 31లోపు చెల్లించాలి. ఒకసారి చెల్లించని పక్షంలో గడువు ముగిసిన తర్వాత 2 శాతం ఫైన్‌తో చెల్లించాల్సి ఉంటుంది. పన్నులను బిల్ కలెక్టర్‌కు నేరుగా చెల్లించి రసీదు పొందాలి. బల్దియా కార్యాలయంలో, మీసేవ కేంద్రాల్లో, ఆన్‌లైన్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చు.



సిద్ధం చేసిన డిమాండ్ నోటీసులు

చర్యలు తీసుకుంటాం



నగరవాసులు పన్నులు సకాలంలో చెల్లించాలి. బకాయిపడ్డ వారు కూడా వెంటనే చెల్లించాలి. మొండి బకాయిదారులకు డిమాండ్ నోటీసులు ఇస్తున్నాం. అయినా స్పందించకుంటే చర్యలు తప్పవు.

– రాజేంద్ర కుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్

క్లుప్తంగా

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

నిజామాబాద్అర్బన్: ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు తేదీని డిసెంబర్ 3వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్ని గురుకుల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా విద్యార్థులు ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూ.100 అపరాధ రుసుముతో డిసెంబర్ 4 నుంచి 10వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో 11 నుంచి 17వ తేదీ వరకు చెల్లించవచ్చని, అలాగే రూ.వెయ్యి అపరాధ రుసుముతో 18 నుంచి 24వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు.

డిసెంబర్ 4న పరాఖ్ - 2024 పరీక్ష



మోపాల్(నిజామాబాద్రూరల్): డైట్, బీఈడీ శిక్షణ విద్యార్థులకు డిసెంబర్ 4వ తేదీన పరాఖ్ – 2024 పరీక్ష ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) అశోక్ తెలిపారు. మంగళవారం నగర శివారులోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డైట్, బీఈడీ శిక్షణ విద్యార్థులకు పరాఖ్ పరీక్షకు సంబంధించి మెళకువలపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. డైట్, బీఈడీ విద్యార్థులు పరీక్షకు తప్పకుండా హాజరుకావాలన్నారు. అనంతరం ఫీల్డ్ ఇన్విజిలేటర్గా శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శంకర్, క్వాలిటీ కో ఆర్డినేటర్ జీవన్, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంకేతిక శిక్షకుడు లక్ష్మీనాథం, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థులు డిబార్

తెయూ(డిచ్పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ (సీబీసీఎస్) బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సులకు సంబంధించి 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2, 4, 6వ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్వహించిన పరీక్షకు 7,748 మందికిగాను 7,147 మంది విద్యార్థులు హాజరు కాగా, 601 మంది గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 6,564 మంది విద్యార్థులకుగాను 5,989 హాజరు కాగా 572 విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు. మాల్ ప్రాక్టీస్కు పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆయన తెలిపారు.

మక్కజొన్న జూడులు దగ్ధం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేమికలాన్ శివారులో మంగళవారం తాడ్వాయికి చెందిన గైని చంద్రంకు సంబంధించి మక్కజొన్న జూడులు దగ్ధమై రూ.30వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. జూడులపై విద్యుత్ వైర్లు పడడంతో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. కామారెడ్డి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను చల్లార్చింది. ప్రభుత్వం తనకు నష్టపరిహారం ఇవ్వాలని బాధితుడు కోరాడు.

మొరం టిప్పర్లకు జరిమానా

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గోపన్పల్లి శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లను తహసీల్దార్ సురేశ్ మంగళవారం పట్టుకున్నారు. మొరం తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని అధికారులకు సమాచారం అందించారు. ఒక్కో టిప్పర్కు రూ.5 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ దీక్ష చేశారు

- దీక్ష దివస్కు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలి
- చురుగ్గా పని చేయండి.. భవిష్యత్ స్థానిక ప్రజాప్రతినిధులు మీరే..
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్రెడ్డి, దీక్ష దివస్ ఇన్చార్జి ఫారుక్ హుస్సేన్

నిజామాబాద్అర్బన్: తెలంగాణ ప్రజలను వంచించిన కాంగ్రెస్ను భూస్థాపితం చేసి రాష్ట్రాన్ని సాధించడమే లక్ష్యంగా కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగారని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. దీక్ష దివస్ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతో విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వారు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారన్నారు. కేసీఆర్ దీక్షకు ఇంత ప్రాధాన్యత ఉన్నకారణంగానే గత 15 సంవత్సరాలుగా నవంబర్ 29ని దీక్ష దివస్గా జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ ఏర్పాటులో చోటుచేసుకున్న పరిణామాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈనెల 29న దీక్ష దివస్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ ఆదేశించిందన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి సుమారు 500మంది తరలిరావాలని కోరారు. పైరవీ కారులు, కాంట్రాక్టర్లు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్కు ఎటువంటి నష్టం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులను, ప్రజాప్రతినిధులను గ్రామాల్లో కొట్టే పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు చురుగ్గా పని చేయాలని, భవిష్యత్ లో మీరే సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలుగా పని చేసే అవకాశం ఉందన్నారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎ మ్మెల్యే ఆశన్నగారి జీవన్రెడ్డి మాట్లాడుతూ.. దీక్ష దివస్ను విజయవంతం చేయాలన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పాడి పంటలతో కళకళలాడిన తెలంగాణ గడ్డ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా మారిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారని, తనను సైతం వేధిస్తున్నారని అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు. దీక్ష దివస్ జిల్లా ఇన్చార్జి ఫారుక్ హుస్సేన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అరాచకాలు పెరిగాయన్నారు. దీక్షా దివస్ స్ఫూర్తితో పోరాడుదామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు, సీనియర్ నాయకులు రాజారాంయాదవ్, రాంకిషన్రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు

రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలి

అదనపు కలెక్టర్ అంకిత్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్: యువత రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిజామాబాద్ ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవంలో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలు రూపొందించిందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం చాలా గొప్పదని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం వాటిల్లితే పౌరులు కోర్టుల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి కంఠేశ్వర్ వరకు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీబీసీ ఎఫ్పీవో ధర్మానాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి నరేశ్, తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవీంద్రరెడ్డి, జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్, ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మోహన్ దాస్, శరత్, అధ్యాపకులు బి రామచంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ కళాశాలలో జాతీయ పాల దినోత్సవం



కామారెడ్డి అర్బన్: జాతీయ పాల దినోత్సవం సందర్భంగా స్థానిక డెయిరీ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం వర్గీస్ కురియన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో అధిక పాల ఉత్పత్తికి కారకులైన శ్వేత విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్ జయంతిని జాతీయ పాల దినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమని కళాశాల అసోసియేట్ డీన్ కేఎస్ ఉమాపతి అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కామారెడ్డి ఎంపీడీవో కె.నాగవర్ధన్ మాట్లాడుతూ..వర్గీస్ కురియన్ను ఆదర్శంగా తీసుకొని డెయిరీ విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. అధ్యాపకులు మాధవి, శైలజ, శ్రీనివాస్, సురేందర్,స్వాతి, శరత్కుమార్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



ఖలీల్వాడి: నిజామాబాద్ న్యాయవాది ఖాసీంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం అత్యవసరంగా సమావేశమైన న్యాయవాదులు ఖాసీంపై దాడి ఘటనపై చర్చించి విధులను బహిష్కరించారు. అనంతరం కోర్టు చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మానవహారం చేసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో ల్యాండ్ మాఫియా పెరిగిపోయిందని, శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందన్నారు. న్యాయవాది ఖాసీంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, రిమాండ్ చేయలన్నారు. అరెస్ట్ చేసే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి జిల్లా కోర్టు వద్దకు వచ్చి న్యాయవాదులతో మాట్లాడారు. దాడి కేసులో హత్యాయత్నం సెక్షన్ అల్టేషన్ చేసి కోర్టులో మెమో దాఖలు చేశామని, అరెస్ట్కు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఖచ్చితంగా అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిల్ మెంబర్ రాజేందర్రెడ్డి, వసంతరావు, రాజు, సురేశ్, పిల్లి శ్రీకాంత్, ఆయూబ్, శ్రీధర్, భాస్కర్, పి వెంకటేశ్, మాణిక్, ఆశ నారాయణ, రాజు, రవీందర్, విఘ్నేశ్, జైపాల్, జునైద్, ఇర్ఫాన్, జిషంత్, ఇంతియాజ్, ఖలీద్, కవితారెడ్డి, అంజలి, కావ్య, అఖిల, ప్రవీణ, నూర్జహాన్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు



అనూషను సన్మానిస్తున్న అంతరెడ్డి రాజిరెడ్డి

నిజామాబాద్అర్బన్: గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించిన మోర్తాడ్ మండలం దోన్పాల్ గ్రామానికి చెందిన పర్స అనుషను మంగళవారం ఆయన ఘనంగా సన్మానించారు. కేంద్ర గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనం సైతం ఏర్పాటు చేశామన్నారు. సమయం వృథా చేసుకోకుండా ఉద్యోగం సాధించాలనుకునే వారికి లైబ్రరీలు గొప్ప అవకాశమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ రాజారెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరేశ్రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్, శ్రీనివాస్, సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేస్తాం



మాట్లాడుతున్న గడుగు గంగాధర్

నిజామాబాద్ సిటీ: రైతును రాజు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు అన్నారు.'రైతులు – రాజ్యాంగం అనే అంశంపై హైదరాబాద్లోని బూర్గుల రామకృష్ణారావు భవనంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన 'భూమి సంవాద్' చర్చ, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక చర్చ ఏర్పాటు చేశారు. రైతును రాజు చేస్తామని ఈ సందర్భంగా సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ మాట్లాడారు. రైతుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ కూడా హాజరై మాట్లాడారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురి మృతి

విద్యుత్ షాక్తో ఒకరు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో విద్యుత్ షాక్తో ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన పట్నం సిద్ధిరాములు(49)అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన చిట్కూరి కృష్ణారెడ్డి వ్యవసాయ భూముల్లో చెట్లు కొడుతుండగా విద్యుత్షాక్ తగిలింది.వెంటనే సిద్ధిరాములును కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పరిస్థితి విషమించి..

మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన బూస బాల్రాజు(46) ఈ నెల 4న దాబా పై నుంచి పడి గాయపడ్డాడు. ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్ కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి...

ఆర్మూర్టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్హెచ్వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. సుమారు 50 ఏళ్ల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందన్నారు. మృతుడి ఒంటిపై బ్లూకలర్ ప్యాంట్ ఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి సంబంధీకులు పోలీస్స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు..



అజయ్(ఫైల్)

నిజామాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాలూర్గ్రామానికి చెందిన అజయ్(24) సోమవారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్వో ఆరిఫ్ తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాలూర్కు చెందిన అజయ్ గత శుక్రవారం నగరానికి చెందిన తన స్నేహితుడి ఇంట్లో శుభకార్యానికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా ఖానాపూర్ శివారులో కుక్కలు బైక్కు అడ్డువచ్చాయి. దీంతో అజయ్ పక్కనే ఉన్న విద్యుత్స్తంభానికి ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. బాధితుడిని హైదరాబాద్కు తరలించగా, అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హెచ్వో తెలిపారు.

ఒకరి అదృశ్యం



ఖలీల్వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్స్టేషన్ పరిధిలోని పూలాంగ్కు చెందిన సిరపత్ నరేశ్(55) అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఔరంగాబాద్కు చెందిన సిరపత్ నరేశ్ కుటుంబ సభ్యులతో కలిసి రెండేళ్ల క్రితం నగరానికి వచ్చి పూలాంగ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, ఈనెల 24న ఇంట్లో నుంచి వెళ్లిన నరేశ్ తిరిగి రాలేదన్నారు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికి నా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య రమ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖలీల్వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో వేధించిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్య ఆరోగ్యంపై ఆందోళనతో ఆత్మహత్య

ఎడపల్లి(బోధన్): భార్య ఆరోగ్యంపై ఆందోళనతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జంలం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

గ్రామానికి చెందిన సాయిలు(52) భార్య మీన అనారోగ్యంతో బాధపడుతున్న మెంట్రాజ్పల్లిలోని తన చెల్లెలి ఇంటికి వెళ్లి నెలరోజులుగా అక్కడే ఉంటోంది. దీంతో సాయిలు తన భార్య ఆరోగ్యంపై ఆందోళనతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్రెడ్డి తెలిపారు.

డిచ్పల్లిలో చోరీ

డిచ్పల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న మణికంఠ లక్ష్మీనర్సయ్య అనే వ్యక్తి ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. లక్ష్మీనర్సయ్య దంపతులు ఊరికి వెళ్లగా వారి పెద్ద కుమారుడు పైపోర్షన్కు తాళం వేసి కింది పోర్షన్ లో నిద్రించాడు. అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు రూ.2వేల నగదు, మొబైల్ ఫోన్, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఇందల్వాయి: ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కొటాల్పల్లి బీట్ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ని మంగళవారం సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్వో రవి మోహన్భట్ తెలిపారు. అనుమతులు లేకుండా అటవీప్రాంతంలో పనులు చేపట్టినా, ఇసుక తరలించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వీరంతా ఎవరి తాలూకా..?



ఎమ్మెల్యే గారి తాలూకా..



రెబల్స్టార్ ప్రభాస్ తాలుకా

రోడ్డు రవాణా నిబంధనలను తుంగలో తొక్కుతూ 'మేం ఫలానా వారి తాలూకా..' అంటూ ఇష్టారాజ్యంగా రోడ్లపై వాహనాలు నడుపుతున్న వారంతా 'ఎవరి తాలూకా..?' అసలు పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని నగరవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆ ద్విచక్ర వాహనాల కారణంగా ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే.. ఎవరికి చెప్పుకోవాలి? బాధ్యులను ఎలా గుర్తించాలని ప్రశ్నిస్తున్నారు. పలు ద్విచక్రవాహనదారులు ఇలా తమ వాహనాల నంబర్ ప్లేట్లపై ఇష్టారీతిన స్టిక్కర్లు అతికించి నడుపుతున్న దృశ్యాలు 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





నంబర్ ప్లేట్పై ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్ లోగోలు.. నెంబర్ కనిపించకుండా ఏర్పాటు చేసిన మాస్క్

జాతీయస్థాయి ఫుట్బాల్ టోర్నీకి ఎంపిక



ప్రజ్ఞను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్రెడ్డి

మాక్లూర్: నిజామాబాద్ నగర శివారులోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థిని వై ప్రజ్ఞ జూనియర్ విభాగంలో జాతీయ స్థాయి ఫుట్బాల్ టోర్నీకి ఎంపికై ంది. ఇటీవల మెదక్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్బాల్ టోర్నమెంట్లో ప్రజ్ఞ ఉత్తమ ప్రతిభకనబర్చింది. హెచ్ఎం ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో ప్రజ్ఞతోపాటు ఉపాధ్యాయులు మంగళవారం బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్రెడ్డిని కలువగా ఆయన అభినందించారు. డిసెంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు జమ్మూకశ్మీర్లో నిర్వహించే జాతీయ స్థాయి టోర్నీలో ప్రజ్ఞ పాల్గొననుందని ప్రసన్నకుమారి తెలిపారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్స్ చాంపియన్షిప్



విజేతగా నిలిచిన విజయ్హైస్కూల్ క్రీడాకారులు



నందిపేట్ నియో లిటిల్ ఫ్లవర్ క్రీడాకారులు..

నిజామాబాద్ నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నాగారంలోని రాజారం స్టేడియంలో నిర్వహించిన అండర్ – 8, 10, 12 బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్షిప్ సోమవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రస్మా జిల్లా సలహాదారు మామిడాల మోహన్, అధ్యక్షుడు నిత్యానంద్ హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అండర్ – 8 బాలికల విభాగంలో జిల్లా ఓవరాల్ చాంపియన్షిప్ను విజయ పబ్లిక్ స్కూల్ (నిజామాబాద్), బాలుర విభాగంలో నియో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ (నందిపేట్) కైవసం చేసుకున్నాయి. అండర్ –10 బాలుర విభాగంలో విజయ హై స్కూల్, బాలికల విభాగంలో హంస వాహిని హై స్కూల్ (ధర్పల్లి) చాంపియన్షిప్ను కైవసం చేసుకున్నాయి.అండర్ – 12 బాలుర విభాగంలో టీఎస్డబ్ల్యూఆర్ఎస్ (ఆర్మూర్), బాలికల విభాగంలో విశ్వ వికాస్ హై స్కూల్ చాంపియన్షిప్ను దక్కించుకున్నాయి. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రత్నాకర్ నరాల, రాజాగౌడ్, ప్రధాన కార్యదర్శి అరుణ్, ట్రస్మా పట్టణ అధ్యక్షుడు ధర్మరాజు, విశ్వవికాస్ కరస్పాండెంట్ వంశీకృష్ణ, హంసవాహిని కరస్పాండెంట్ మాన్సింగ్, విద్యా హైస్కూల్ కరస్పాండెంట్ సందీప్, శ్రీమేధా కరస్పాండెంట్ దత్తు, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆర్మూర్ గురుకులం క్రీడాకారులు..

'పారదర్శకంగానే ఎన్నికలు నిర్వహిస్తున్నారు'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్రెడ్డి

మద్నూర్(జుక్కల్): ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగి వరకు వ్యవస్థపై నమ్మకంతో ఎంతో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, కామారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్రెడ్డి గుర్తు చేశారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మంగళవారం అదనపు కలెక్టర్ మాట్లాడారు. పేపర్ బ్యాలెట్తోనే ఎన్నికలు నిర్వహించాలని వేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు కొట్టేసిందన్నారు. ఈవీఎంల విశ్వసనీయతపై ప్రశ్నించే వారి అస్థిరతను ఎత్తిచూపిందని తెలిపారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ ముజీబ్ ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ఆర్మూర్టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి వినయ్రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ డీఎస్పీ మదన గంగాధర్ అన్నారు. పట్టణంలోని మినిస్టేడియంలో కొనసాగుతున్న 46వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళా హ్యాండ్ బాల్ క్రీడా పోటీల ఉమ్మడి జిల్లా జట్టు శిక్షణ శిబిరాన్ని వారు సందర్శించారు. ఉత్తమ ప్రతిభకనబర్చి భవిష్యత్లో మంచి క్రీడాకారులుగా ఎదగాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, పీఈటీలు పాల్గొన్నారు.